నష్టపరిహారం అందేనా?

- భారీ వర్షాలతో మట్టి ఇళ్లు నేలమట్టం
- పరిహారం కోసం బాధితుల ఎదురుచూపులు
- జాబితా తయారీలో అధికారుల నిమగ్నం



అయిజలో కూలిన ఇంటిని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నర్సయ్య (ఫైల్)

అయిజ: ఇటీవల ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాలతో అనేక మట్టి ఇళ్లు నేలమట్టమయ్యాయి. మరికొన్ని ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. వర్షాలతో మట్టి ఇళ్లు పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉండడంతో బాధిత కుటుంబాలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బయటికి పరుగులు తీశారు. సురక్షిత ప్రాంతాల్లో ఉంటూ కాలం వెల్లదీస్తున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం సకాలంలో అందించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మతులు చేయించలేక.. తాత్కాలికంగా గూడు సౌకర్యం ఏర్పాటు చేసుకోలేక అష్టకష్టాలు పడుతున్నారు. మండలవ్యాప్తంగా 63 ఇళ్లు కూలిపోయినట్లు రెవెన్యూ అధికారుల సర్వేలో తేలింది. ఇళ్లు కూలిపోవడమేగాక.. ఇంట్లో ఉన్న వస్తువులు వర్షానికి తడిసిపోయి పనికి రాకుండా పోయాయి. రెవెన్యూ అధికారులు కూలిన ఇళ్ల పరిశీలనలో నిమగ్నమయ్యారు.

మొదటి జాబితా సిద్ధం..

కూలిన ఇళ్లకు సంబంధించి అధికారులు మొదటి జాబితాను సిద్ధం చేశారు. 36 ఇళ్లు కూలిపోయినట్లు రికార్డుల్లో నమోదు చేశారు. యాపదిన్నెలో 1, పులికల్‌లో 9, రాజాపూర్‌లో 1, టీటీదొడ్డిలో 1, ఉత్తనూరులో 3, ఎక్లాస్‌పూర్‌లో 7, బింగుదొడ్డిలో 7, గుడుదొడ్డిలో 2, కొత్తపల్లిలో 3 ఇళ్లు కూలిపోయినట్లు అధికారులు గుర్తించారు. అయితే రెండోవిడుత చేపట్టిన సర్వేలో మొత్తం 27 ఇళ్లు కూలిపోయినట్లు అధికారులు గుర్తించారు. వీటిపై పంచనామా నిర్వహించి రికార్డులో నమోదు చేయాల్సి ఉంది. ప్రభుత్వం అందించే నష్టపరిహారం కోసం బాధితులు ఎదురుచూస్తున్నారు. పూర్తిగా ఇల్లు కూలిపోతే రూ.97వేలు, పాక్షికంగా కూలితే రూ.5,200, పూరిగుడిసె కూలిపోతే రూ.3,200 నష్టపరిహారం ఇవ్వనున్నారు. ఈ పరిహారం ఏ మూలకు సరిపోదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూర్తిగా కూలిన ఇళ్లకు నష్టపరిహారం పెంచాలని కోరుతున్నారు. కాగా కూలిన ఇళ్లపై పూర్తిస్థాయి విచారణ అనంతరం ఉన్నతాధికారులకు నివేదించి బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించనున్నారు.



బింగుదొడ్డిలో కూలిన నర్సింహులు ఇల్లు

నష్టపరిహారం పెంచాలి..



ఇళ్లు కూలిపోయిన వారికి ప్రభుత్వం ఇస్తున్న నష్టపరిహారం చాలా తక్కువగా ఉంది. పాక్షికంగా కూలిపోయిన ఇళ్లకు రూ.5,200 నుంచి రూ.3,200 వరకు మాత్రమే అందిస్తామంటున్నారు. ఇల్లు పూర్తిగా కూలిపోతే రూ.97వేలు ఇస్తామంటారు కానీ.. ఇప్పటివరకు అలా ఎవరికీ ఇవ్వలేదు. ఇచ్చే నష్టపరిహారం ఏదో త్వరగా అందజేస్తే బాగుంటుంది.

– దేవేంద్ర, ఎక్లాస్‌పూర్

ఆలస్యం చేయొద్దు..



వర్షాలకు కూలిన ఇళ్లకు నష్టపరిహారం చెల్లించడంపై ఆలస్యం చేయొద్దు. అధికారులు పంచనామా నిర్వహించిన వెంటనే జాబితా తయారు చేసి ఉన్నతాధికారులకు పంపాలి. బాధితులకు నష్టపరిహారం త్వరగా చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలి. నష్టపరిహారం విషయంలో ప్రతి సంవత్సరం కాలయాపన జరుగుతుంది. కనీసం ఈ ఏడాదైనా నష్టపరిహారం త్వరగా అందజేసి ఆదుకోవాలి.

– మహబూబ్ భాషా, అయిజ

త్వరలో పరిహారం అందిస్తాం

వర్షాలకు కూలిపోయిన ఇళ్లను పరిశీలించి బాధితులకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మొదటి జాబితాకు సంబంధించి విచారణ పూర్తయ్యింది. రెండవ జాబితాపై విచారణ కొనసాగుతుంది. కూలిన ఇళ్ల పరిశీలనను త్వరగా పూర్తి చేయాలని ఆర్ఐలను ఆదేశించాం. తుది జాబితా అందగానే ఉన్నతాధికారులకు నివేదిస్తాం. వీలైనంత త్వరగా బాధితులకు నష్టపరిహారం అందజేస్తాం.

– లక్ష్మి, తహసీల్దార్, అయిజ

క్లుప్తంగా

మొండి వైఖరి వీడాలి

శాంతినగర్: పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం మొండివైఖరి వీడాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు మధు అన్నారు. వడ్డేపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎదుట పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ప్రభుత్వం కళ్లు తెరిచే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి



శాంతినగర్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బీజేపీని ఆదరించాలని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ కోరారు. వడ్డేపల్లి మండలం జిల్లెడుదిన్నెలో ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేళ్ల మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. మరోసారి బీజేపీని ఆదరిస్తే ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింహులు పాల్గొన్నారు.

ప్రతి బూత్ నుంచి తరలిరావాలి



శాంతినగర్: మహబూబ్‌నగర్‌లో సోమవారం నిర్వహించనున్న బీజేపీ ప్రజాగర్జన సభకు ప్రతి బూత్ నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్ పిలుపునిచ్చారు. శాంతినగర్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాగర్జన సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, శక్తికేంద్రం ఇంచార్జ్‌లు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, అయ్యరాజు, రాజశేఖర్‌గౌడ్ ఉన్నారు.

ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం



అలంపూర్ రూరల్: ఐక్యతతోనే సమస్యలు పరిష్కారమవుతాయని పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు గడ్డం నాగన్న, కార్యదర్శి కుంటుమల్ల మారుతి అన్నారు. పట్టణంలోని చేనేత సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ ప్రాంతీయ పద్మశాలి సంఘం సభ్యత్వం తీసుకొని ఐక్యతను చాటాలని కోరారు. ఆగస్టు 1న అలంపూర్ జోగుళాంబ అమ్మవారి సన్నిధి నుంచి పద్మశాలీల రాజకీయ చైతన్య యాత్ర ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పల్లె ఎల్లయ్య, శ్రీనివాసులు, బిజ్జల సుబ్రహ్మణ్యం, కస్తూరి సర్వేశ్వర్, కాంచనం నాగరాజు, రంగ నరేష్, చాణక్య, శేఖర్, శ్రీనివాసులు, వెంకటేష్ పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం

అమరచింత: వర్షాల కారణంగా మట్టిమిద్దెలు కూలిన బాధితులను వీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదుకుంటామని ఆ సంస్థ నిర్వాహకుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంగలి నాగమణి, కాడ్గి లక్ష్మణ్ ఇళ్లు వర్షాలకు కూలిపోవడంతో వారిని వర్కటం పరామర్శించారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను అందిస్తామని భరోసా కల్పించారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వర్షాలకు కూలిన ఇళ్లను పరిశీలించి బాధితులకు తమ సంస్థ ద్వారా చేతనైన సహాయం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వెంకటేష్‌గౌడ్, నాగరాజ్, అభిరామ్, అఖిల్, రాజేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నదీతీర ప్రాంతంలో అప్రమత్తం

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ కర్ణాటక రాష్ట్రం నుంచి వరద చేరుతుండడంతో దిగువకు నీటిని వదులుతున్నారు. నదీతీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సింధూజ అన్నారు. మండలంలోని రేచింతల, జూరాల, వీరరాఘవపూర్, ఆరేపల్లి, కత్తేపల్లి, తూంపల్లి, మెట్లంపల్లి, గుంటిపల్లి గ్రామాల రైతులు, మత్స్యకారులు నది సమీప ప్రాంతాలకు వెళ్లకూడదని సూచించారు. నదిలో వేసుకున్న మోటార్లు, వలల కోసం వెళ్లకూడదని నీటి ఉధృతికి కొట్టుకుపోయే అవకాశం ఉందని, ప్రమాదాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు.

ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు సమర్పిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న పల్లయ్య

శాంతినగర్: మాదాసి, మాదారి కురువలను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పిద్దామని ఆ సంఘం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కురువ పల్లయ్య పిలుపునిచ్చారు. శాంతినగర్‌లో ఆదివారం మాదాసి, మాదారి కురువల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదాసి, మాదారి కురువలను ఎస్సీ జాబితాలో చేర్చడంపై ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు.ఎస్సీ కుల ధృవీకరణ పత్రాల జారీపై అసెంబ్లీలో చర్చించాలని జిల్లా ఇంచార్జ్ మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు సమర్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం తాలూకా అధ్యక్షుడు మల్లికార్జున్, మండల గౌరవాధ్యక్షుడు పెద్ద కురువ సోమన్న, సింగిల్‌విండో డైరెక్టర్ సంకాపురం రాముడు, జొల్లబ్బాయి, కోయిల్‌దిన్నె కృష్ణ, నరేష్, శివప్రసాద్, తిక్కయ్య ఉన్నారు.

సభకు తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు



సభకు బయలుదేరుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

గద్వాల అర్బన్/ఎర్రవల్లిచౌరస్తా: జడ్చర్లలో ఆదివారం నిర్వహించిన మాదిగల విశ్వరూప మహాసభ సన్నాహక సభకు జిల్లా నుంచి ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దఎత్తున బయలుదేరారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ నేతృత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. అశోక్, జయరాజ్, మోషన్న, మధు, గోపాల్, పరుశరాం, శ్రీను, డేవిడ్, ప్రవీణ్, హరి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీలో బీసీలకు ప్రాధాన్యం



అలంపూర్‌లో మాట్లాడుతున్న కేశవరావు

అలంపూర్/ఎర్రవల్లిచౌరస్తా: బీఎస్పీలో బీసీలకే అధిక ప్రాధాన్యం ఉంటుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని బీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం నుంచి నాలుగురోజుల పాటు బహుజన రాజ్యాధికార యాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. మొదట అలంపూర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో యువతకు ఓటు హక్కుపై అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. మరుసటి రోజు అయిజ, వడ్డేపల్లి మున్సిపాలిటీల్లో బహుజన రాజ్యాధికార యాత్ర నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ వస్తున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, యువత అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా ఇటిక్యాల మండలం వల్లూరు, చాగాపూర్ గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తిరుపాల్, ప్రభుదాస్ నాగజ్యోతి, రాజేశ్వరి, వెంకటేశ్వర్లు, తిరుపాల్, వెంకటేశ్వర్లు, స్వాములు, భీమేష్, శ్రీనివాస్, ఆదాం పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయండి



నాగర్‌దొడ్డి స్టేజీ సమీపంలో గుంతలమయంగా మారిన ప్రధాన రహదారి

మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి స్టేజీ సమీపంలో గద్వాల–అయిజ ప్రధాన రహదారి గుంతలమయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారిపై పెద్దఎత్తున గోతులు ఏర్పడినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయిజ నుంచి 3 కిలోమీటర్ల మేర బీటీ నిర్మించి మధ్యలో వదిలేయడంతో ప్రమాదకరంగా మారిందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల రూరల్: పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరుతోందని, బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిలో అన్ని రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలుస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గద్వాలలో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్, వైస్‌చైర్మన్ బాబర్ ఉన్నారు.

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..



అలంపూర్‌లో పీరును ఊరేగిస్తున్న చిన్నారులు

అలంపూర్ రూరల్: పట్టణంలోని సాలేవీధిలో ఆదివారం చిన్నారులు పీరును తయారు చేసి ఉత్సాహంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పులు వాయిస్తూ చిందులేశారు.

మానవపాడు: మౌలాలిస్వామి పీర్ల ఉత్సవాల్లో భాగంగా సోమవారం కోలాటం, బొడ్డెమ్మ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు చంద్‌స్వామి, మొల్ల షాకీర్, వెంకటేష్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. పోటీల్లో ప్రతిభకనబర్చిన వారికి బహుమతులను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలి



ప్రహరీ లేని ఎద్దులగూడెం ప్రాథమిక పాఠశాల

మల్దకల్: మండలంలోని ఎద్దులగూడెం ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రహరీ లేకపోవడంతో పాఠశాల ఆవరణలో పశువులు, పందులు, మేకలు సంచరిస్తున్నాయని తెలిపారు. అదేవిధంగా పాఠశాల ఎదుట మల్దకల్–ఎల్కూరు ప్రధాన రహదారి ఉందని, విద్యార్థులు రోడ్డుపైకి వస్తే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

వైద్య విద్యార్థినికి ఆర్థికసాయం



విద్యార్థికి చెక్కును అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని నాగరాలకు చెందిన చారకొండ లక్ష్మి గతేడాది ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి సరిగా లేక చదువు మానేసే పరిస్థితి రావడంతో స్పందించిన వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి లక్ష్మికి మొదటి ఏడాది రూ.లక్ష చెల్లించారు. మంచి మార్కులతో పాస్ అవ్వడంతో అమ్మాయిని మంత్రి అభినందిస్తూ రెండో సంవత్సరం ఫీజు రూ.లక్ష చెక్కును ఆదివారం తన క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. తన చదువుకు సహకారం అందిస్తూ ఆర్థికంగా ఆదుకున్న మంత్రి నిరంజన్‌రెడ్డికి లక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ నిర్మల, ఉపసర్పంచ్ చంద్రాయుడు, నాయకులు పృథ్వీరాజు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే చర్యలు



ధరూరు: మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్ఐ శివానందంగౌడ్ అన్నారు. మండలంలోని నర్సన్‌దొడ్డి–జూరాల రోడ్డుపై ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనం నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.

పార్టీ బలోపేతానికి కృషి

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని జానంపేటలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ హాజరై మాట్లాడారు. మండలంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తూ, నియోజకవర్గంలో వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాములుయాదవ్, విండో డైరెక్టర్ నరసింహ, గంగాధర్‌యాదవ్, ఉమర్, రాజు, ఇమ్రాన్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత బోధించిన జగద్గురువు శ్రీకృష్ణుడు

మదనాపురం: విశ్వలోక కల్యాణం కోసం జగద్గురువు శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధించారని, ఆయనే గుణాతీత గురువు అని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి కొత్తకోట, మదనాపురం మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు తిర్మలాయపల్లిలో త్రైత సిద్ధాంతం భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. గురువు అనే పదానికి వచ్చిన మూల్యాంకాలను ఆయన వివరించారు. సాక్షాత్తు శ్రీకృష్ణ పరమాత్మను జగద్గురువుగా భావించి పూజలు చేయాలని కోరారు. ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక సభ్యులు మాసన్న, వేణుగోపాల్ పాల్గొన్నారు.

స్వీపర్లకు రూ.27వేల వేతనం ఇవ్వాలి



మండల కమిటీ సభ్యులతో రామలింగయ్య

గట్టు: ప్రభుత్వం స్వీపర్లకు కనీస వేతనం రూ.27వేలు చెల్లించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రామలింగయ్య డిమాండ్ చేశారు. మండలంలోని మాచర్లలో ఆదివారం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా నర్సింహులు, ప్రధాన కార్యదర్శిగా మల్లయ్య, సహాయ కార్యదర్శిగా సోమన్న, కోశాధికారిగా అబ్దుల్‌బాబులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రామలింగయ్య మాట్లాడుతూ స్వీపర్లు 34ఏళ్లుగా పని చేస్తుండగా, కేవలం రూ.1,623 మాత్రమే చెల్లిస్తున్నారని.. మరికొందరికి రూ.4వేలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్వీపర్లచే వెట్టిచాకిరి చేయించుకుంటుదని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లు సమస్యల పరిష్కారం కోసం నిరాహారదీక్ష చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి స్వీపర్లకు కనీస వేతనం రూ.27వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వెలుగులోకి సేవా కార్యక్రమాలు



టీవీలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిర్వహిస్తున్న మన్‌కీ బాత్‌తో దేశంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు వెలుగు చూస్తున్నాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని బుడుగజంగాల కాలనీకి చెందిన సోషల్ మీడియా విభాగం పట్టణ కన్వీనర్ చిన్నికృష్ణ నివాసంలో ఆదివారం ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. ఈ సందర్భంగా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రధాని నిర్వహిస్తున్న మనుసులో మాట కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోందని, ఇప్పటివరకు 103 కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నర్సింహయ్యశెట్టి, ఓబీసీసెల్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, చేనేతసెల్ కోకన్వీనర్ శివన్న, ఎస్సీమోర్చా పట్టణ అధ్యక్షుడు ఆది, పోలింగ్ బూత్ అధ్యక్షుడు రఘు పాల్గొన్నారు.

పరామర్శ

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిట్యాలకు చెందిన పోగుల భగవంతు ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఏఐసీసీ కార్యదర్శి జిల్లెల చిన్నారెడ్డి స్థానిక నాయకులతో కలిసి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణ, మాజీ వైస్ ఎంపీపీ సురేష్‌గౌడ్, గ్రామాధ్యక్షుడు రోహిత్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



ఉండవెల్లిలో మిర్చి పంటలో కలుపు నివారణకు గుంటిక కొడుతున్న రైతు



చిన్న ఆముదాలపాడు శివారులో మొక్కజొన్న పంటలో పెరిగిన కలుపు

రైతులకు 'కలుపు' భారం

ఇటీవల కురిసిన వర్షాలతో పత్తి, కంది, మొక్కజొన్న, మిరప పంట పొలాల్లో కలుపు అధికమైంది. కలుపును తొలగించడం రైతులకు భారంగా మారింది. సమీప గ్రామాల నుంచి కూలీలను తీసుకొచ్చి కలుపు తీయిస్తున్నారు. ఒక్కో కూలీకి రూ.250 నుంచి రూ.300 చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఎద్దుల గడాలు, కూలీల ఖర్చు భారంగా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉందని వాపోతున్నారు.

– ఉండవెల్లి